క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
సీఐ కాశీవిశ్వనాథ్



లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద నంబర్ ప్లేటు లేని వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మీర్‌పేట: రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మీర్‌పేట పోలీసులు సోమవారం సాయంత్రం లెనిన్‌నగర్ రైతుబజార్ కూడలి వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపైకి వచ్చిన 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. తనిఖీల్లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గౌరినాయుడు, ఎస్ఐలు గోవిందస్వామి, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: కాలనీల్లో నూతన పైపులైన్లు ఏర్పాటు చేసి డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని న్యూ మారుతీనగర్ కాలనీ రోడ్ నంబర్–12ఏలో డ్రైనేజీ పైపులైన్ పాడైపోయిన విషయం తెలుసుకుని అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మురుగు నీరు ఇండ్లు, రహదారులపై పారకుండా నూతన లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేందర్, జవాన్ శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లోని సాహెబ్‌నగర్ గ్రామంలో గల శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, రవిశంకర్, నర్సింహరెడ్డి, దేవిక, సురేశ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రెస్టారెంట్లు నాణ్యతను పాటించాలి
మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: రెస్టారెంట్లలో నాణ్యతతో పాటు పరిశుభ్రమైన ఆహారం వినియోగదారులకు అందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో గాయత్రీ రెస్టారెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పాటించి భోజనం అందించాలన్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లు ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నాయకులు రాజునాయక్, యాదగిరిగౌడ్, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, జాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జయేందర్, రవీందర్, రామప్ప, సీతారామ్ నాయక్, రాజునాయక్, నవీన్, సుధీర్‌గౌడ్, రాజేష్, కిష్టయ్య, పాండు, లచ్చానాయక్, దేవులానాయక్, శ్రీహరి, నర్సింహగౌడ్, రమేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం.. భవితకు సోపానం

- మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు అవకాశం
- ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు పొడిగింపు



మహేశ్వరం మోడల్ స్కూల్

మహేశ్వరం: రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. పాఠశాలల్లో ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యను ఇందులో అందిస్తున్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌ను గతంలో నెలకొల్పారు. అందులో పేద విద్యార్థులకు చక్కని నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉంది.

దరఖాస్తులు ఇలా చేయాలి

- ఇంటర్‌లో చేరేందుకు టీఎస్ ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ధ్రువపత్రాలతో ఇంటర్ నెట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం కలదు.

రిజర్వేషన్లు

ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం, దివ్యాంగులకు 3శాతం, బాలికలకు 33 శాతం, ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం, ఓసీలకు 36 శాతం సీట్లను కేటాయిస్తారు. మొత్తం నాలుగు గ్రూపులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఉంటాయి. ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున నాలిగింటికి 160 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జాబితా సిద్ధం చేస్తారు. మైనార్టీ వర్గాల వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఈ నెల 31 వరకు దరఖాస్తులను ప్రభుత్వం పొడిగించారు. జూన్ మొదటివారంలో దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపిక జాబితాను పాఠశాలలో ప్రదర్శించి, ఎంపికైన వారి విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు. చివరగా ఎంపిక జాబితాను జిల్లా కలెక్టర్, డీఈఓ ధ్రువీకరించిన అనంతరం పాఠశాలలో ప్రదర్శిస్తారు. అనంతరం తరగతులు ప్రారంభమవుతాయి.

అదనపు హంగులతో ప్రాంగణం

- 4 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నత మౌలిక వసతులతో విశాలమైన తరగతి గదులు, ప్రహరీ గోడతో ఉన్న పక్కా స్కూల్ భవనం.
- ఆహ్లాదకరమైన పచ్చిక బయళ్లతో కూడిన పాఠశాల ప్రాంగణం, పచ్చని చెట్లతో కూడిన పరిసరాలు.
- మెరిట్ ప్రాతిపదికన, దూర ప్రాంతం నుంచి వచ్చే బాలికలకు స్కూల్ ప్రాంగణంలోనే హాస్టల్ వసతి సౌకర్యం.
- అధునాతనమైన కంప్యూటర్లు, ప్రొజెక్టర్ల సహాయంతో హైస్పీడ్ ఇంటర్ నెట్ సౌకర్యంతో డిజిటల్ తరగతుల నిర్వహణ.
- టూరిజం అండర్ హోటల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్ ట్రెండ్‌లలో వృత్తి విద్యా కోర్సులు చదువుకునే సౌకర్యం.
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం.

31 లోపు దరఖాస్తులు



ప్రభుత్వ మోడల్ స్కూల్ నందు ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నాం. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక్కో గ్రూపులో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయి. విశాలమైన పాఠశాల, కళాశాల ప్రాంగణం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకుల చేత నాణ్యతతో కూడిన బోధన ఉంటుంది. ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– బి.ధనుంజయ్, మోడల్ స్కూల్, ప్రిన్సిపాల్

రసీదు భద్రపర్చుకోవాలి

విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన సదస్సులో అధికారులు



ధన్నారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు: విత్తనాల ఎంపికపై రైతులను అప్రమత్తం చేయడానికి వ్యవసాయాధికారులు ఈ నెల 27 నుంచి 30 వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు చేపట్టారు. అందులో భాగంగా మొదటి రోజు సోమవారం కొత్తూర్, మీర్‌ఖాన్‌పేట, గుమ్మడవెల్లి, ధన్నారం, చిప్పలపల్లి, రాచులూరు, నేదునూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధన్నారంలో నిర్వహించిన సదస్సులో మహేశ్వరం ఏడీఏ ఎం.సుజాత, కందుకూరు ఏఓ లావణ్య మాట్లాడారు. లైసెన్స్ ఉన్న అధీకృత దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్లు, బస్తాలపై లాట్ నంబర్, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ, కంపెనీ లేబుల్ తదితర వివరాలను తప్పకుండా పరిశీలించాలన్నారు. తప్పనిసరిగా కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రసీదు తీసుకుని భద్రపరిస్తే, పంట దెబ్బతిన్నప్పుడు నష్టపరిహారం పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ధరకు వస్తాయని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఈఓలు శ్రీహరి, రాజు, సృజన, అర్చన, రాఘవేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ మత్స్యకారుల సహకార సంఘం ఎన్నిక



నియామక పత్రాన్ని అందిస్తున్న మత్స్యకారుల సహకార సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరు గ్రామ మత్స్యకారుల సహకార సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని సోమవారం మత్స్యకారుల సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మండల గౌరవ అధ్యక్షుడు ఎడ్ల బాబురావుముదిరాజ్ ప్రకటించారు. లేమూరు గ్రామ సంఘం అధ్యక్షుడిగా జక్కుల కృష్ణ, కార్యదర్శిగా ఎడ్ల రాజశేఖర్‌ముదిరాజ్, సభ్యులుగా సంజీవముదిరాజ్, శ్రీధర్‌ముదిరాజ్, కృష్ణముదిరాజ్‌తో పాటు మొత్తం తొమ్మిది మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేష్‌ముదిరాజ్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎడ్ల మహేందర్‌ముదిరాజ్, మత్స్యకారుల సంఘం నాయకులు బాలకృష్ణముదిరాజ్, నారాయణ, యాదయ్య, నర్సింహ, లక్ష్మయ్య, రామకృష్ణ, కేశవులు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి

వనస్థలిపురం: గొర్రెల నట్టల నివారణ మందులను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. దాసరి అజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారని, 2 కోట్ల గొర్రెలు, మేకలు ఉన్నాయని పేర్కొన్నారు. మందులు పంపిణీ చేయకపోవడంతో గొర్రెల కాపరులు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి మందులు కొని అప్పులపాలు అవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గొర్రెలు పంపిణీ చేస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గొర్రెల కాపరులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవాలని కోరారు.



రావిర్యాల–తుక్కుగూడకు రోడ్డులో నిలిచిన మురుగు నీరు

మురుగు వెళ్లే మార్గం ఏది?

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ–రావిర్యాల రోడ్డుపై దుర్గంధం వ్యాపిస్తోంది. కొద్ది రోజుల నుంచి మురుగు నీరు నిల్వడంతో ఈ దుస్థితి నెలకొంది. సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన మురుగు నీరు రావిర్యాల పెద్ద చెరువులోకి వదలడానికి గతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పనులను చెరువు వరకు పూర్తి చేయలేదు. దీంతో మురుగు రోడ్డుపైన నిలుస్తుంది. ప్రయాణికులతో పాటు, స్థానిక రైతులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెరువు వరకు పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీసీల అభ్యున్నతే ధ్యేయం

చంచల్‌గూడ: బీసీల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ఏ. రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. సూర్యచంద్ర సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా సేవారత్న అవార్డును ఆయన అందుకున్నారు. రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదిగా, బీసీ సంఘం నేతగా 35 ఏళ్లుగా బలహీన వర్గాల వారికి ఎన్నో సేవలు చేశానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బడంగ్‌పేట్: బాలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బాలాపూర్ ఏఈ పర్లపెల్లి రాజు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బాలాపూర్ గ్రామంతో పాటు వెంకటేశ్వర కాలనీ, ఆర్చిడ్, సీపీఎస్ఆర్ మల్లాపూర్, దేవతలగుట్ట, ఫ్రైడ్ హిల్స్, బాలాజీటౌన్‌షిప్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాయల్ కాలనీ, మెట్రో సిటీ ఫేస్ 1,2,3,4, బాలాగార్డెన్, తవక్కల్ కిరాణం ఏరియా, డ్రీమ్ సిటీ, రాయల్ కాలనీ, తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ రాజు కోరారు.

ఎర్రకుంట ఫీడర్ పరిధిలో..

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఎర్రకుంట, ఉదా స్కూల్, అలీనగర్ ఫీడర్ల పరిధిలోని షాయిన్‌నగర్, ఎర్రకుంట, సదత్‌నగర్, తూర్ కాలనీ, తయ్యాబా కాలనీ, ఆయేషాకాలనీ, జమ్‌జమ్ కాలనీ, అబూబాకర్ కాలనీ, జాబ్రీ కాలనీ, జిమ్ గల్లీ, ఎంఎంసీ మెడికల్, ఆలేన్ కాలనీ, వాదీ ఉమార్, రోషన్ హోటల్, అలీనగర్, మినర్ కాలనీ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యూబా కాలనీ, మహ్మద్‌నగర్, బాబానగర్, వాదీ సాలిన్, బాబానగర్ రోడ్ నంబర్ 1 నుంచి 8వరకు, జల్‌పల్లి గేట్ వరకు, అల్‌జూబ్రి కాలనీ వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని పహాడీషరీఫ్ ఏఈ ఎల్‌వి. సత్యనారాయణ తెలిపారు.

సరూర్‌నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విశాలాంధ్ర ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ జైపురికాలనీ, అలకాపురం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ గ్రీన్‌హిల్స్, హనుమాన్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు.

తలసేమియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



తలసేమియా వ్యాధి కేస్ స్టడీస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

మన్సూరాబాద్: జన్యుపరంగా సంక్రమించే తలసేమియా వ్యాధిపై ప్రజలు అగాహన పెంచుకోవాలని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ హిమటాలజీ, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ హెడ్ డాక్టర్ సచిన్ జాదవ్ అన్నారు. హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో వ్యాధిపై అవగాహనతో పాటు కేస్ స్టడీలతో రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించి, హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన చికిత్సను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే తలసేమియా వ్యాధితో విపరీతమైన అలసట, నీరసం, చర్మం పాలిపోవడం, ముఖం ఆకారంలో మార్పులు, ఎదుగుదల లేకపోవడం, పొట్టవాపు, మూత్రం ముదురు రంగులో రావడం లాంటి లక్షణాలుంటాయని తెలిపారు. వివాహానికి ముందు తలసేమియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇద్దరిలో ఏ ఒక్కరికి తలసేమియా లక్షణాలున్నా జన్యుపరంగా కౌన్సిలింగ్ తీసుకోవాలన్నారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో తలసేమియా క్లీనిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, అంతేకాకుండ జన్యు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్. నర్సింహరావు, ఎంఆర్ఎం బాబు, నవ్యశ్రీ , కంచన్ ఎస్ చన్నవార్, సత్యనారాయణ, సురేశ్ థామస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ హరి

చైతన్యపురి: ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో మేనేజర్ హరి అన్నారు. డిపోలో ఏర్పాటు చేసిన 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్–2' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 రోజుల పాటు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్, హెల్త్ వలంటీర్స్ సువర్ణ, పురుషోత్తం సిబ్బంది బుచ్చిరెడ్డి, జీఎస్‌రెడ్డి, అశోక్, లలిత తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా అంతర్గత రోడ్లు.!



ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్ బస్తీ అంతర్గత రోడ్లు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ నుంచి తీసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్ల వెంట దుర్వాసన వస్తోందని, అంతేగాకుండా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో నిత్యం పారిశుధ్యం పనులు చేపట్టలని స్థానికులు కోరుతున్నారు.

– దిల్‌సుఖ్‌నగర్

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు మేలు

నాగోలు: సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీకి చెందిన అరవింద్ కుమార్ వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన ఆపరేషన్‌కు కావాల్సిన ఆర్థిక సాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. రూ.1.50 లక్షల ఎల్వోసీ చెక్కు మంజూరు కాగా ఎమ్మెల్యే బాధితుడు కుటుంబ సభ్యులకు సోమవారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బాధితుడి తల్లి ప్రసన్నరాణి, రాకేశ్ ఠాగూర్ పాల్గొన్నారు.